
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024
5
తిరుపతి



ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి -తిరుమల



చెన్నైకి చెందిన కిరోరిమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఈ మేరకు చెక్కును అందజేశారు.

సిఎంఆర్ ఫ్యాక్టరీ నిర్లక్ష్యం

గ్యాస్ లీకై 30 మందికి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి - ఏర్పేడు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం రాజులపాలెం టోల్‌గేట్ పక్కన నిర్మించిన సిఎంఆర్ ఈకో అల్యూమినియం ఫ్యాక్టరీలో శనివారం సాయంత్రం గ్యాస్ లీకై 30 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 25 మంది మహిళలే కావడం గమనార్హం. వీరిని హుటాహుటిన రేణిగుంట బాలాజీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అంత పెద్ద ఫ్యాక్టరీలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ఈ ఘటన జరిగిందని 'స్థానికులు' మండిపడుతున్నారు. స్థానికంగా నిరుద్యోగులు ఎంత మంది ఉన్నా ఈ ఫ్యాక్టరీలో 'నాన్ లోకల్'వారిని నియమించుకుని ఇష్టానుసారం ఫ్యాక్టరీ యాజమాన్యం వ్యవహరిస్తుందన్న



విమర్శలూ లేకపోలేదు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

సిఎంఆర్ ఈకో అల్యూమినియం కర్మాగారంలో అల్యూమినియం అల్లోయ్ ప్రైమరీ మెటీరియల్ తయారవుతుంది. స్క్రాప్ మెటీరియల్ కరిగించుటకు ప్రథమంగా వేస్ట్ ఆయిల్‌ను వాడతారు. ఈ ఆయిల్‌ను మొదటగా మండించుటకు ప్రైమరీగా గ్యాస్‌ను ఉపయోగిస్తారు. అయితే గ్యాస్ వాడకం పరిమితుల్లో ఉంటుంది. గ్యాస్ లీకేజి అధికంగా ఉండటం వల్ల ఒక్కసారిగా వేస్ట్ ఆయిల్ అత్యధికంగా ఫర్నిస్‌లో మండటంతో అధిక మంటలు ఏర్పడి ఎక్కువగా పీల్చుకోవడం వల్ల 30 మంది అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం వీరిని రేణిగుంటలోని బాలాజీ ఆస్పత్రికి తరలించి శ్వాస సంబంధిత సమస్య ఉండడంతో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసేవారంతా ఎక్కువమంది 'నాన్ లోకల్' కావడం గమనార్హం.

బాధితులను పరామర్శించిన మద్దిల గురుమూర్తి

రేణిగుంట బాలాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను తాజా మాజీ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఎంపి మద్దిల గురుమూర్తి పరామర్శించి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ చికిత్స అందించాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం సిఎంఆర్ కర్మాగారం ప్రతినిధులతో మాట్లాడి ప్రమాదం ఏ విధంగా జరిగిందో తెలుసుకున్నారు. ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

బాధితులకు న్యాయం చేయాలి : రంగయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు

రైతుసంఘం జిల్లా నాయకులు రంగయ్య, రాంబాబు, వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఘటనను ఖండించారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించి, న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.

చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి

2,540మంది పోలీసులతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడమే పోలీసుల లక్ష్యమని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి జిల్లా పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమావేశమై, సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అంతే తీవ్రమైన ప్రతి చర్యలు పోలీస్ శాఖ నుండి ఉంటాయని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే ఏజెంట్లు, అభ్యర్థులు ఆర్ ఓ ఇచ్చిన ఐడి కార్డు, ఏదైనా ఒక అడ్రస్ ప్రూఫ్ ఉన్న ఐడి కార్డు మాత్రమే తీసుకుని రావాలన్నారురు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా యాక్సెస్ కంట్రోల్ వద్ద తనిఖీ చేసిన తర్వాతనే సంబంధిత గేట్ల ద్వారా మహిళా యూనివర్సిటీ లోపలికి అనుమతిస్తామన్నారు. ఎవరూ పెన్నులు, హిడెన్ కెమెరాలు, వాటర్ బాటిళ్లు, మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వంటివి తమ వెంట తీసుకుని రాకూడదు. ఒకవేళ ఎవరైనా తీసుకుని వస్తే యాక్సెస్ కంట్రోల్ వద్దనే వారిని నిలువరించి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడే అవకాశం ఉన్నందున 1వ తేది మధ్యాహ్నం నుంచి జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు, మొబైల్ పార్టీలు, మాబ్ కంట్రోల్ టీంలు, అరెస్టు టీంలు, స్ట్రైకింగ్ ఫోర్సు, క్విక్ రెస్పాన్స్ టీంలు వంటివి అన్ని రకాల బందాలు సన్నద్ధమై విధులలో ఉన్నాయి. ఎగ్జిట్ పోల్స్ కు సంబంధించి ఎవరు కానీ బాణసంచా కాల్చడం, వేడుకలు చేసుకోవడం, ర్యాలీలు



నిర్వహించడం పూర్తిగా నిషిద్ధం. ఎన్నికల నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే అంతే తీవ్రమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గం పై ప్రత్యేక దష్టి సారించి శాంతి భద్రతల పరిరక్షణకు ఒక అదనపు ఎస్పి స్థాయి అధికారిని నియమించి, ప్రతి సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పహారా కాస్తున్నాం.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్, స్పెషల్ ఆఫీసర్ ఎస్ పి సరిత, అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, విమల కుమారి, శివరామిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చంద్రగిరి సబ్ డివిజన్, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిది లో రఘునాథ్ రిసార్ట్స్, తుమ్మలగుంట తదితర ప్రాంతాలలో ఎస్పై నాగేంద్ర ఆధ్వర్యంలో శనివారం ఉదయం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు.

స్థానికులతో సమావేశమై జూన్ 4 వ తేదీ వరకు ఎలక్షన్ కోడ్ తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ, పోలీస్ వారికి సహకరించాలని కోరారు. చంద్రగిరి సిఐ రామయ్య ఆధ్వర్యంలో అగిగలవారిపల్లి, పనపాకం, కొంగరవారిపల్లి, ఐతేపల్లి, అగరాల గ్రామాల్లో అవగాహనా సదస్సులను నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అవగాహన ఉండాలి : జేసీ

ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా.. పక్కాగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన మోడల్ కౌంటింగ్ కేంద్రంలో హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ద్వారా అన్ని అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల ఎ ఆర్ ఓ లు, అడిషనల్ ఎ ఆర్ ఓ లకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఓట్ల లెక్కింపు పై శిక్షణ ఇస్తూ పలు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ 8 గంటలకు లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని, పోస్టల్ బ్యాలెట్స్ 25 ఓట్లు చొప్పున కట్టలు కట్టాలని, ప్రతి టేబుల్ కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు రౌండ్ వారీ ఫలితాలు మీడియా సెంటర్ కు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, తిరుపతి శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు రిటర్నింగ్ అధికారులు నిశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, చంద్రమునీ, కిరణ్ కుమార్, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్ పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సుశీల దేవి, నియోజకవర్గ ఆర్వోలు, అడిషనల్ ఆర్వోలు పాల్గొన్నారు.



చేపల మార్కెట్ దగ్ధం
రూ.7 లక్షల నష్టం

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో ఉన్న తాత్కాలిక చేపల మార్కెట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 7 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. చేపల మార్కెట్లోని ఒక దుకాణంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడిన కారణంగా మంటలు చెలరేగి సుమారు నాలుగు షాపులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యాయి. దుకాణాల్లోని ఎండు చేపలు, పచ్చి చేపలు అగ్నిలో కాలిపోవడంతో సుమారు ఏడు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు .

వడదెబ్బకు కూలి మృతి

ప్రజాశక్తి - కేవిబి పురం

కేవిబి పురం మండలంలోని కోటమంగాపురం గ్రామానికి చెందిన మెరుల చంద్రయ్య(57) కూలి పనులు చేస్తుండగా మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో శనివారం కళ్ళు తిరిగి కిందపడిపోయాడు. వెంటనే స్థానికుల సహాయంతో హాస్పిటల్‌కి తీసుకుని వెళుతుండగా మార్గమధ్యంలో మతి చెందాడు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చంద్రయ్య కూలి పనికి వెళ్లి తన భార్య పిల్లలను పోషించేవాడని, ఆయన చనిపోవడంతో భార్య జయలక్ష్మి (50), కూతురు జయశ్రీ (22) వీధినపడ్డారని, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోట్లపూడి రాజేష్‌పై వైసిపి కౌన్సిలర్ అశోక్ దాడి

ప్రజాశక్తి నాయుడుపేట

వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోట్లపూడి రాజేష్‌పై అదే పార్టీకి చెందిన నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ కావేరిపాకం అశోక్ కుమార్ కుటుంబ సభ్యులతో కలసి దాడి చేశారని, ఇంట్లోని పిల్లలను, ఆడవారిని భయభ్రాంతులకు గురి చేసి ఇబ్బందులు సష్టించారని, కిటికీలు తలుపులు పగలగొట్టేందుకు ప్రయత్నించారని పొట్లపూడిరాజేష్ నాయుడుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ అశోక్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఇరువురూ ఒకే పార్టీకి చెందిన వారే కావడం, కిలీవేటి సంజీవయ్య అనుచరగణం కావడం గమనార్హం. పోలీసుల వివరాల మేరకు... నాయుడుపేటలో మే నెల ఆదివారం నుండి బుధవారం వరకు జరిగిన నాయుడుపేట శ్రీ శ్రీ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర సందర్భంగా జాతరలో ఇరువురి మధ్య చోటు చేసుకున్న మనస్పర్థలు కారణంగా కౌన్సిలర్ అశోక్ తన కుటుంబ సభ్యుల తోపాటు మరో ముగ్గురితో కలసి తన ఇంటి వద్దకు వచ్చి కిటికీలు, సిసి కెమెరాలు పగలగొట్టి దాడికి పాల్పడ్డారని రాజేష్ ఫిర్యాదు చేశారన్నారు.



కౌన్సిలర్ అశోక్ కుమార్ ఇంటి మీదకు దౌర్జన్యంగా వస్తున్న దశ్యాలు రాళ్లతో ఇంటి మీద విసురుతున్న దశ్యాలు సీసీ కెమెరాలో స్పష్టంగా రికార్డు అయ్యాయి. ఆ మేరకు అశోక్ కుటుంబ సభ్యులతోపాటు శ్రీకాంత్, సాయి, వంశీ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జరిగిన విషయంపై ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఎలా స్పందిస్తారు, కేసులో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి, పోలీసులు ఎంతవరకూ చర్యలు తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే

మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రబీలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న హేమ సింధు మోడ్రన్ రైస్ మిల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి ఆర్డిఓ రవి శంకర్ రెడ్డి డీఎస్పీ ఉమామహేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఏర్పేడు మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన లోకేష్ యాదవ్ అనే ఓ వడ్ల వ్యాపారి ఈనెల 29న హేమ సింధు మోడ్రన్ రైస్ మిల్లు యాజమాన్యం తన ద్వారా రైతులకు రావాల్సిన రూ.5 లక్షల పెండింగ్ బిల్లులను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందంటూ ఆర్డిఓ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీవో వెంటనే మిల్లు యాజమాన్యంపై చర్యలు చేపట్టి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని శుక్రవారం ఆదేశించారు. న్యాయం జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్విమ్స్‌లో సిఎంఇ విజయవంతం

తిరుపతి సిటి : స్విమ్స్ పాథాలజీ, సర్జికల్, మెడికల్ అండ్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సిఎంఇ విజయవంతమయ్యింది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్‌బిట్ల, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రుక్మాంగద, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర, రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్రమణ్యన్, డాక్టర్ ప్రాణబంద్ దాస్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శనివారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొని స్వామి వారి మొక్కులు చెల్లించుకున్నారు.దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శ్రీవారి శేష వస్త్రంతో సత్కరించారు.

అసలే ఎండలు... అప్రకటిత కోతలు..

శ్రీసిటి పరిధి గ్రామాల్లో ఆగ్రహం

ప్రజాశక్తి - సత్యవేడు

ఒకవైపు భారీ ఉష్ణోగ్రతలతో జనం తలడిల్లుతున్నారు. వేడి గాలులతో ఇంట్లో ఉండటమే కష్టతరంగా ఉంది. దీనికి తోడు విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో సత్యవేడు మండలం శ్రీ సిటీ పరిధి గ్రామాలు తల్లడిల్లిపోయాయి. సంబంధిత శ్రీ సిటీ పరిధి విద్యుత్ శాఖ ఏఈ ఏకపక్ష నిర్ణయం వల్ల ప్రజల అవస్థలు పడుతున్నారు. మెయింటెనెన్స్ పేరిట దాదాపు నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా ఆపేయడంతో ప్రజలు, పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా వద్ధులు పిల్లలు ఇళ్లలో ఫ్యాన్లు తిరక్క సమీప చెట్ల వద్దకు పరుగులు పెట్టాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. కనీసం పత్రిక ప్రకటన కూడా ఇవ్వకుండా విద్యుత్ శాఖ ఏఈ గంటల తరబడి విద్యుత్ సరఫరా ఆపివేయడం అన్యాయమైన విషయమని వినియోగదారుల వాపోతున్నారు. తనకు పెద్దల సహకారం ఉందని, తాను ఏ నిర్ణయం తీసుకున్నా తనను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని వినియోగదారుల ఆరోపిస్తున్నారు. వినియోగదారుల అవస్థలు పట్టించుకోకుండా ఇక్కడ ఏఈ కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- డెస్క్

నారాయణవనం మండల పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాలమంగళం జూన్ 1 నుంచి హైస్కూల్ ప్లస్ గా అప్గ్రేడ్ అయింది. గ్రామ సర్పంచ్, పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఇంటర్ తరగతుల ప్రారంభమయ్యాయి. మండలంలో రెండవ హైస్కూల్ ప్లస్ కోఎడ్యుకేషన్ కాలేజీగా పాలమంగళం పాఠశాల ఏర్పాటయ్యింది. ఎంపీసీ, సిఈసి గ్రూపులు న్నాయని, ఒక్కో గ్రూపులో 40 మంది చొప్పున చేరవచ్చని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులు బృందాలుగా పలు గ్రామాలలో కాలేజీ గురించి ప్రచారం చేస్తున్నారు. తమ పిల్లలకు గ్రామంలోనే కాలేజీ ఏర్పాటు తల్లితండ్రులకు ఎంతో ఆనందం కలగచేసినట్లుగా పలువురు అభిప్రాయపడ్డారు. జూన్ 1 న జరిగిన అడ్మిషన్స్ ప్రచారంలో రాజారెడ్డి, కళ్యాణి, మనోహరి, సుబ్బరాజు, ధనంజయులు, చిరంజీవి, ప్రసాద్, నాగేంద్ర పాల్గొన్నారు.

పల్లెలో పహారా...!

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

కౌంటింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్ది ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళన జిల్లా ప్రజల్లో నెలకొంది. గెలుపోటముల కథ పక్కన పెడితే. ఆకతాయిల అల్లర్లు, మందుబాబుల వీరంగం. రౌడీయిజం, దాడులు, ప్రతిదాడులు, పెట్రోల్ బాంబులు, వాహనాలు దగ్ధం, మీడియా, పోలీసులపైనే దాడులు. ఇవి గడిచిన రోజుల్లో జరిగిన ఘటనలు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ రోజు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు భారీ ఏర్పాటు చేశారు. పల్లె పల్లెలో పహారా ఏర్పాటు చేశారు. ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చేందుకు చేసిన మార్చ్‌ఫ్లాగ్ ద్వారా ధైర్యం భరోసా కల్పించే ప్రయత్నం చేసిన్నా, జిల్లా వాసులు భయం గుప్పిట్లో బతుకుతుండడం గమనార్హం. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో పుంగనూరు, కుప్పం, తిరుపతి జిల్లాలో చంద్రగిరి నియోజకవర్గాల్లో గొడవలు జరిగే అవకాశం ఉందన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

తిరుపతి జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీల అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహించారు. విమర్శలకు ప్రతివిమర్శలు ఘాటుగానే చేశారు. వ్యూహాలు, ఎత్తులకు పై ఎత్తులు, డబ్బుల పంపిణీ, ప్రలోబాల పరం. బుజ్జగింపులు, బెదిరించడం. విమర్శలు ఇవ్వన్ని ప్రచార పర్వంలో గట్టాలు. కానీ జిల్లా వ్యాప్తంగా మే 13వ తేదిన పోలింగ్ జరిగింది. అంతా బాగానే సాగింది. పోలింగ్ రోజు రాత్రి చంద్రగిరి నియోజకవర్గంలో, పోలింగ్ మరుసటి రోజు తిరుపతి కేంద్రంగా జరిగిన గొడవులు ప్రజల్ని భయోందళనలోకి నెట్టేశాయి. సాక్షాత్తు దేశంలోనే ఏకైక మహిళా విశ్వవిద్యాలయంగా పేరుగడించిన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం ఎదుటే జరిగిన ఘటనలు శోచనీయం. మారణాయుధాలతో, బీరుబాటిళ్లతో, బ్యాట్లు, స్టిక్‌లు, రాళ్లు, సుత్తులు, సమ్మెట్లు, రాడ్లుతో విరుచుకుపడి సుమారు 6 గంటల పాటు భీభత్సం సృష్టించారు. వీటన్నింటికి రాజకీయ గొడవలే కారణం. పోలీసుల ఉదాసీనత మరో కారణం. ఆఖరికి మీడియాపై, పోలీసులపై కూడా దాడులు తప్పలేదు. రెండు రోజుల పాటు జిల్లాలో జరిగిన ఘటనలకు బాధ్యతులను చేస్తూ ఒక ఎస్పి, ఇద్దరు డిఎస్పిలు, నలుగురు సిఐలు, ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేశారు. శాఖపరమైన విచారణకు



ఆదేశించారు. సాక్షాత్తు కేంద్ర ఎన్నికల సంఘంమే స్వయంగా స్పందించి, తిరుపతి ఎస్పిగా కేంద్ర సర్వీసుల్లో ఉన్న వ్యక్తిని నియమించడం గమనార్హం. కొత్త ఎస్పి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కౌంటింగ్ ప్రశాంతంగా జరిపించాలనే లక్ష్యంతో భారీ బందోబస్తుకే ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు, పల్లె పల్లెల్లో, వాడ వాడన మార్చ్‌ఫ్లాగ్ పేరుతో సాయుధ బాలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం జిల్లా వ్యాప్తంగా కవాతు నిర్వహించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదనే ధైర్యాన్ని ఇచ్చేందుకు కృషి చేశారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రమైన శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పియే స్వయంగా అర్ధరాత్రి, మిట్టమధ్యాహ్నం అని తేడా లేకుండా ఎపుడు పడితే అప్పుడు ఆకస్మిక తనిఖీల పేరుతో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. నాలుగు ప్రత్యేక బృందాలతో కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత, నగరంలో శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతిలో 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉంటుంది. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రత్యేకించి పటిష్ట భద్రత ఏర్పాటు చేవారు.కౌంటింగ్ కేంద్రాన్ని నో ఫ్లయ్యింగ్ జోన్, రెడ్ జోన్‌గా ఇప్పటికే ప్రకటించారు. పోలీసుల హడావిడి, ముందస్తు ఏర్పాట్లను గమనిస్తున్న జిల్లా వాసులు భద్రత మాట దేవుడెరుగు, ఇంత హడావిడి చేస్తున్నారంటే ఆ రోజు పరిస్థితి ఎలా ఉంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఏదేమైనా ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతవరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సాఫీగా సాగాలని, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ప్రజానీకం కోరుకుంటోంది.

'కార్పొరేట్'కు దీటుగా భువనేశ్వరి విద్యానికేతన్

ప్రజాశక్తి-తిరుపతి సిటి



కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా విద్యా బోధన భువనేశ్వరి విద్యానికేతన్‌లోనే సాధ్యమని కరస్పాండెంట్ అమిలినేని దివ్య చౌదరి పేర్కొన్నారు. ప్రశాంత్ నగర్, యోగిమల్లవరం శివాలయం ఎదురుగా. తిరుచానూరు, తిరుపతి (రూరల్)ని పాఠశాల ఆవరణంలో ఆమెను కలిసిన ప్రజాశక్తితో మాట్లాడుతూ...తమ సంస్థ విద్యార్థులకు అత్యుత్తమ బోధనను అందిస్తూ అందరి మన్ననలూ పొందుతోందన్నారు. ఎందరినో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత తమ పాఠశాల సొంతమని తెలిపారు. అధునాతన విద్యావిధానాలపై విద్యావేత్తలతో సెమినార్స్ నిర్వహిస్తూ అందరి భాగస్వామ్యంతో అద్భుత విజయాలు సాధిస్తున్నామన్నారు. విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సమాజం గర్వపడేలా వారిని తీర్చిదిద్దే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఎస్-ఎస్సి 2024 ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. పట్టుదల, ఉపాధ్యాయుల రాజీలేని నిరతంర కృషి పాఠశాల విజయ రహస్యాలుగా అభివర్ణించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు తమ సంస్థకు మూలస్తంభాలుగా నిలిచి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారని పేర్కొన్నారు.. రెసిడెన్షియల్ తరహాలో విద్యాబోధన, వీక్లీ, మంత్లీ టెస్టులు నిర్వహించి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడం ద్వారా తమ విద్యార్థులు అత్యదిక మార్కులు తెచ్చుకోవడంలో సునాయాసంగా విజయవంతమవుతున్నట్లు తెలిపారు. అడ్మిషన్‌లు జరుగుతున్నాయి. విద్యా సంస్థ విజయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, సంస్థ శ్రేయోభిలాషుల సలహాలు, సహకారం ఎన్నటికీ మరువలేనివన్నారు. పాఠశాల చైర్మన్ అమిలినేని మధు ప్రోత్సహం, సహయసహకారాలు మరువలేనివన్నారు. వివరాలకు 0877-2238725, 95533 71717 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు.....

- అందమైన, ఆహ్లాదకరమైన, శబ్దకాలుష్యం లేని వాతావరణంలో పాఠశాల
- చక్కటి గాలి, వెలుతురుతో కూడిన విశాలమైన తరగతి గదులు. ఆటస్థలం.
- చదువులో వెనుక బడిన విద్యార్థులపైన ప్రత్యేకమైన వ్యక్తిగత శ్రద్ధ చూపడం
- ఐఐటి, నీట్ తరహాలో 6 నుంచి 8వ తరగతుల వరకు విద్యాబోధన.
- ఐఈవో-ఐఎంవో-ఎన్ఎస్‌వో లాంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం.
- అపారమైన అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చే విద్యాబోధన.
- జాతీయ విద్యావిధానాన్ని విద్యార్థులకు అందించడం
- ప్రాజెక్టు పనులు, ఫీల్డ్ టిప్స్, ప్రయోగశాల, లైబ్రర్, సైన్స్ ఫెయిర్స్.
- అందమైన చేతి వ్రాత మొదలగు వాటిపైన పిల్లలకు అవగాహన కల్పించడం.
- విద్యార్థులలో ఎల్ఎస్ఆర్‌డబ్ల్యు నైపుణ్యాన్ని, రీజనింగ్ నైపుణ్యాన్ని అభివద్ధి చెయ్యడం.
- యోగ, మెడిటేషన్, ఫుట్ బాల్ గేమ్స్ జోనల్, జిల్లాస్థాయి ఆటల శిక్షణ
- స్పోకెన్ ఇంగ్లీష్ పైన ప్రత్యేక శ్రద్ధ.
- 6 నుండి 10వ తరగతి వరకు డిజిటల్ తరగతి గదులు.
- ప్రతి టర్మ్‌కు ఒక సారి పిటిఎం మీటింగు ను జరిపి విద్యార్థి యొక్క విద్యా ప్రమాణాలను తల్లిదండ్రులకు తెలియ పరచుట.
- గ్రామర్, క్విజ్, జికె. కంప్యూటర్స్, దక్షిణ బారత హిందీ పరీక్షలు మొదలైన వాటిపై ప్రత్యేక శిక్షణ.
- సైన్స్ ల్యాబ్ సౌకర్యం.
- అధునాతన సాంకేతిక బోధనా పద్దతులు.
- బాషపై పట్టుకోసం బాస్‌ప్రోగ్రామ్.





పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన పారిశుధ్య సిబ్బంది

శరవేగంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు పట్టణంలో ప్రధాన వీధుల్లో పారిశుధ్య పనులు పంచాయతీ సిబ్బంది శరవేగంగా చేస్తున్నారు. ఇక్కడ రెండు రోజులు పాటు గంగ జాతర నిర్వహించారు. అమ్మ వారికి వేలాది మంది వేప ఆకుల చీరలతో మొక్కులు చెల్లించుకున్నారు. రోడ్లకు ఇరు వైపులా అంగళ్లు వెలిశాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం, వేపాకు, ఇతర వ్యర్థాలు పడేశారు. భక్తులు ఉపయోగించిన టెంకాయ ఆకుల పీచులు, అన్నదానం నిర్వహించిన వారు చెత్తా చెదారాలను ఎక్కడికక్కడ వదిలేశారు. వాటిని శుభ్రం చేసే పనులు సత్యవేడు పంచాయతీ కార్మికులు మండుటెండలను లెక్కచేయకుండా చెత్తా చెదారాన్ని, వేపాకును ట్రాక్టర్లో నింపి తొలగిస్తున్నారు. విపరీతమైన దుర్గంధం ఉన్నా సత్యవేడు పారిశుధ్య కార్మికులు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ వారు చేస్తున్న శ్రమ అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ పారిశుధ్య పనులు పంచాయతీ సర్పంచ్ మంజుల బెల్ట్ రమేష్, కార్యదర్శి ముని రవికుమార్ పర్యవేక్షణలో సాగుతున్నాయి.

నేడు అపోలో హాస్పిటల్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు లోని సుభాషిని హాస్పిటల్లో జూన్ 2వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు చెన్నై అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అపోలో హాస్పిటల్ పిఆర్ఓ కంరుద్దీన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అపోలో మెయిన్ హాస్పిటల్ కన్సల్టెన్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాధా ప్రియా యలమంచి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఛాతి నొప్పి, ఒత్తిడి, మధుమేహం, శ్వాస ఆడకపోవట, అధిక కొలెస్ట్రాల్, విచ్చల మైన జీవనశైలి, అధిక రక్తపోటు, గుండె పోటు సమస్యలతో బాధపడే రోగులకు చికిత్స నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9885415915, 9177911066, 9105050505 నెంబర్లను సంప్రదించాలని పిఆర్ఓ కంరుద్దీన్ తెలిపారు.

మజ్జిగ ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని కోర్ట్ సెంటర్ వద్ద ఉన్న ప్రయాణికుల షెల్టర్లో గూడూరు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యం లో మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథులు సిఐలు రవి కిరణ్, వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ సేవా సంఘం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోజురోజుకీ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఆని మెళ్ళ శివకుమార్ మాట్లాడుతూ కోర్టు సెంటర్ సమీపంలోని బ్రాహ్మణ భవనాన్ని అతి తక్కువ ఖర్చుతో ఎవరైనా కార్యక్రమా లు చేయాలనుకున్న వారికి ఇస్తామని దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర కులాల వారికి నిబంధనల మేరకు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, శ్రీనివాసరావు, నరసింహన్, కడివేటి రామ్మూర్తి పాల్గొన్నారు.



రుయాస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

న్యాయవాది జన్మదినం సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ప్రముఖ న్యాయవాది సురేష్‌రాజు జన్మదినం సందర్భంగా మంగళంకు చెందిన సతీష్(నాని) ఆధ్వర్యంలో వెయ్యి మందికి తిరుపతి రుయా ఆసుపత్రి వద్ద శరణార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ న్యాయవాదిగా సురేష్‌రాజు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. అలాంటి నిరాడంబర వ్యక్తి పుట్టిన రోజున అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాని చౌదరి, అశోక్, మణి, ప్రశాంత్, యోగి, దినేష్, సురేష్, నికేష్, ఉదయ్ పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

అలిపిరి వద్ద

తిరుపతి(మంగళం): జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డి బాబు జన్మదినం సందర్భంగా అలిపిరి బస్టాండు వద్ద శరణార్థులకు అన్నదానం చేశారు. 150 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మధు, రమణ, మాతయ్య, రామూర్తి యాధవ్, రామకృష్ణ, మణి పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ:

మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన ఉప సర్పంచి కార్వేటి నయినప్పరెడ్డి గుండె పోటుకు గురై గత కొంత కాలంగా శ్రీకాళహస్తికి చెందిన ఎంజీఎం హాస్పిటల్ లోచికిత్స పొందుతూ అక్కడ నయం కాక పోవడంతో తిరుపతి హాస్పిటల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందాడు. ఆయన కొత్తపాలెంలో నైనపరెడ్డి పంచాయతీకి ఎన్నో సేవలు చేశారని గ్రామ సర్పంచి శుభరత్నం హరిప్రసాద్ తెలిపారు. ఉప సర్పంచ్ మృతికి గ్రామ సర్పంచి, గ్రామస్తులు సంతాపం తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డిపిఎం షణ్ముగం

రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలి

ప్రజాశక్తి -రామచంద్రాపురం :

ప్రతి రైతుని ప్రకృతి వ్యవసాయ సాగు చేసే విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం షణ్ముగం అన్నారు శనివారం రాయలచెరువు కట్ట కింద ఉన్న రాయల మండపంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రామచంద్రపురం మండలాన్ని ప్రకృతి వ్యవసాయ సాగులో ఆదర్శ మండలంగా గుర్తించారని చెప్పారు. రైతులను ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి పంటలు సాగు చేసేలా చూడాలని గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు తెలపాలన్నారు. ఈనెల 15వ తేదీ తర్వాత రామచంద్రపురం మండలంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడానికి ఇతర రాష్ట్రాల బృందాలు వస్తున్నాయన్నారు. ఏటీఎం,ఏ గ్రేడ్, పిఎండిఎస్ సాగు అధికంగా ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, మండల మోడల్ టీం లీడర్ విమల, ఎంటీలు రాగమ్మ, సామి కొండయ్య ,రంగయ్య, యూనిటీ ఇన్‌ఛార్జిలు, ఫార్మా సైంటిస్టులు, ఐసిఆర్పీలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'భవిత'లో బంగారు భవిష్యత్తు

ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలకు అవకాశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'భవిత' కేంద్రాలు బంగారు భవిష్యత్తు అందిస్తోంది. ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు చక్కని అవకాశం అని, ప్రత్యేకత కలిగిన పిల్లలు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు, బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. పుత్తూరు మండలంలో ఎంపియుపిఎస్ మెయిన్ స్కూలులో భవిత కేంద్రం వుంది. భవిత కేంద్రంలో ఇద్దరు ఉపాధ్యాయులు, 1 ఆయా ఉంటారు. ప్రతి ప్రత్యేక విద్యార్థి చదువుకోవడమే భవిత కేంద్రం ముఖ్య ఉద్దేశం. మా భవిత కేంద్రంలో 23 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. భవిత కేంద్రానికి పిల్లలే కాకుండా పిల్లలతో పాటు తల్లిదండ్రులు రావడం ప్రత్యేకం. భవిత కేంద్రాలలో అన్ని రకాల విద్యార్థులు వున్నారు. బుద్ధి మాంద్యం (ఇంటలెక్చువల్ డిసెబిలిటి), చెవుడు (డెఫ్) , మాటలు రాకపోవడం (స్పీచ్ ఇంపెయిర్డ్, మెదడు పక్షవాతం (సెరబల్ పాలసి), ఆటిజం వంటి వారు వున్నారు.

భవిత కేంద్రంలో 0 - 18 వయస్సు పిల్లలకు శిక్షణను ఇచ్చి విద్యార్థులను జన జీవన ప్రవంతి లో(మెయిన్ స్ట్రీమ్) కలపడమే. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను (స్పెషల్ టీచర్స్ అసెస్‌మెంట్) చేసి పిల్లల సమస్యలను గుర్తించి (ఎయిమ్, గోల్స్ ఎంపిక) చేసుకోని ట్రైనింగ్ ద్వారా పిల్లలను డెవలప్ చేస్తారు. దీనికి ముఖ్యంగా తల్లిదండ్రులు ముఖ్య బాధ్యతను తీసుకొంటారు.

భవిత కేంద్రాలలో నిర్వహించే యాక్టివిటీస్

1. ఎర్లీ ఇంటర్‌వేషన్, 2. స్పీచ్ థెరఫీ, 3.ఫిజియో థెరఫీ, 4. డైలీ లివింగ్ స్కిల్స్ అండ్అకాడమిక్

స్కిల్స్



భవిత పాఠశాలలో ఫిజియోథెరపీ వివిధ ఆటలు పోటీలు

1. ఎర్లీ ఇంటర్‌వేషన్ అంటే 0- 5 వయస్సు వున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను త్వరగా గుర్తించి ట్రైనింగ్ ఇవ్వడం, త్వరగా గుర్తించడం వల్ల పిల్లలను త్వరగా అభివృద్ధి చేయడానికి ఆలస్యం కాకుండా వుంటుంది.



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

స్పీచ్ థెరపీ: భవిత కేంద్రంలో స్పీచ్ థెరపీ ఉంటుంది. ఛైల్డ్ అండ్ టీచర్ ఎదురుగా కూర్చోబెట్టుకుని అక్షరాలను, పదాలను, వాక్యాలను నేర్పిస్తారు. స్పీచ్ థెరఫీ ఎనీ స్పీచ్ థెరఫీ ఎక్సర్‌సైజెస్ నేర్పుతారు. తద్వారా ఛైల్డ్ సులభంగా నేర్చుకుంటాడు. ఇదేవిధంగా తల్లిదండ్రులు ఇంట్లో కూడా నేర్పడం వల్ల బాగా డెవలప్‌మెంటు వుంటుంది. ఫిజియో థెరఫీ అంటే నడక సరిగ్గా నడవలేక, కూర్చోలేక, మెడ సరిగ్గా నిలబడలేని పిల్లలకు డాక్టర్ కొన్ని మూమెంట్స్ యాక్టివిటీస్ ద్వారా కొన్ని ఎక్సర్‌సైజెస్ ద్వారా పిల్లలు కండరాలు బలంగా తయారై నడవగల్గుతారు. యాక్టివిటి విఎస్ ఫిజియోథెరఫీ డాక్టర్ వారానికి 1 సారి భవిత కేంద్రానికి వచ్చి పిల్లలకు యాక్టివిటీస్ అండ్ ఫిజియో థెరఫీ యాక్టివిటీస్ భవిత లోని టీచర్లు పారెంట్స్‌ను పాల్‌అప్ చేస్తారు.

డైలీ లివింగ్ స్కిల్స్, అకాడమిక్ స్కిల్స్:

డైలీలివింగ్ స్కిల్స్ రోజు వారి కార్యక్రమాలు

ఉదా: బ్రషింగ్, బోతింగ్, టాయిలాటింగ్, తదితరాలు.. ఇలాంటి యాక్టివిటీస్ సైతం ఛైల్డ్ తనంతట తానే చేసుకోలేని పిల్లలకు భవిత కేంద్రంలోని టీచర్స్ ట్రైనింగ్ ఇస్తారు.

అకాడమిక్ స్కిల్స్: రీడింగ్, రైటింగ్, నంబర్స్, టైమ్ వంటి కాన్సెప్ట్‌ను టీచర్స్, ప్రతి యాక్టివిటీని టాస్క్ అనాలసిస్ ద్వారా నేర్పిస్తారు.

ఇతర యాక్టివిటీస్

సర్వే చేయడం, సధరం సర్టిఫికేట్ అప్లై చేయించడం, అసెస్‌మెంటు క్యాంపునకు పిల్లల తల్లిదండ్రులను చైతన్య పరచడం, యుడిఐడి కార్డులు అప్లై చేయడం

ప్రభుత్వం ద్వారా పొందే సదుపాయాలు: ట్రాన్సుపోర్టు అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్, స్టైఫండ్ ఫర్ గల్స్, స్టైఫండ్ ఫర్ హెచ్‌బిఇ, ఎఐడిఎస్అండ్ అప్లైయన్సెస్ ద్వారా వీల్ చైర్స్, హియరింగ్ ఎఐడిఎస్, రోలేటర్ ఎంఆర్ కిట్స్ తదితర పరికరాలు క్యాంపు ద్వారా పంపిణీ చేస్తారు.

అవాంఛనీయ సంఘటనలకు చోటు లేదు: ఎస్ఐ

ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో నేడు ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్నాయని దీంతో ముందస్తుగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నా మని బుచ్చినాయుడు కండ్రిగ ఎస్ఐ వెంకట నరసింహ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో ఎక్కడ అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులను సిద్ధం చేశామని 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఐదుగురి కంటే ఎక్కువ మంది ఉండరాదని, ఒక పార్టీని కించపరిచే విధంగా మరో పార్టీ మాట్లాడడం, వివాదాలు సృష్టించుకోవడం, టపాకాయలు కాల్చడం, తదితర కార్యక్రమాలు చేయరాదన్నారు. విజయోత్సవ ర్యాలీ లు కూడా నిషేధం అని పేర్కొన్నారు .నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాయకులు సహకరించాలని ఎస్సై తెలిపారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు: ఎంపిపి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ఎండ తీవ్రత అధికంగా వుందని జూన్ నెల మొదలైనా ఎండ తీవ్ర ప్రభావం చూపుతోందని మండల అధికారులు అప్రమత్తంగా ఉండి మండల ప్రజలకు తాగు నీటి ఎద్దడి రాకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మండల అధ్యక్షురాలు దువ్వూరు సుజాతమ్మ అధికారులకు సూచించారు. శనివారం దొరవారిసత్రం మండలం పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎంపిడివో శివరామరాజు, శాఖల అధికారులు, ప్రాదేశిక సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి సుజాతమ్మ మాట్లాడుతూ 22 గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరాకు పనిచేస్తున్న నీటి పథకాలు పనితీరు పర్యవేక్షిస్తూ అవి మరమ్మతులకు గురైతే వాటికి వెంటనే రిపేర్లు చేస్తూ అన్నిటికి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారు లను ఆదేశిం చారు. ప్రధానంగా ఈ సమావేశంలో తాగునీటి సమస్య పై చర్చించారు. కొందరు సర్పం చులు వారికి గ్రామ పంచాయతీల సమస్యలను ఎంపిపి ద్వారా అధికారుల దృష్టికి తెచ్చారు. ఉపాధి హామీ



మాట్లాడుతున్న ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ

పనుల సమయంలో కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, పలు సౌకర్యాల కల్పనపై చర్చించారు. ఆయా శాఖల అధికారులు వారి పని తీరు గురించి వివరించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, జెడ్‌పిటిసి రమేష్ బాబు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం

ప్రపంచ పాల దినోత్సవంలో శ్రీజ డెయిరీ ఏరియా ఆఫీసర్ భాస్కర్ రెడ్డి



పాల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న శ్రీజ డెయిరీ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: మండ లంలో పాడి పరిశ్ర మపై ఎక్కువ మంది రైతు లు ఆధారపడి జీవిస్తు న్నారని వారి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని శ్రీజ డెయిరీ ఏరియా ఆఫీసర్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. యర్రావారిపాళెం మండలంలో బిఎంసియు పరిధిలోని రెడ్డి వారి పల్లెలో శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పాల దినోత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పెరుగు తున్న జనాభా సంఖ్యను బట్టి పాలకు మరింత ప్రాముఖ్యత ఉంటుందని పాడి రైతును ప్రోత్సహిం చేలా ప్రతి సంవత్సరం ప్రపంచ పాల దినోత్సవం నిర్వహి స్తున్నా మన్నారు. పాడి పరిశ్రమ వల్ల రైతులకు జీవనోపాధితో పాటు ప్రజల ఆరోగ్యానికి ఎంతో దోహద పడుతోందని పేర్కొన్నారు. పాలలో అధిక పోషకాలు నాణ్యతగా ఉండేలా చూడాలని పాల ఉత్పత్తి ప్రయోజనాలను ప్రచారం చేయడం, జూన్ ఒకటో తేదీ వరల్డ్ మిల్క్ డేగా ప్రకటించిందని పిఐబి ఎగ్జిక్యూటివ్ కేశవ తెలి పారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు సిబ్బంది చిరంజీవి, నాగరాజు, ప్రసాద్, వెంకటేశ్, దిలీప్, కుమార్, కేశవ పాల్గొన్నారు.

క్యాంపస్ : తిరుపతిలో పాలతో తయారు చేసిన పదార్థాల ద్వారా సమతుల్య ఆరోగ్యం సమకూరుతుందని, ప్రతిరోజు పాలు సేవించడం ఆరోగ్యానికి మంచిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తిరుపతి పశు వైద్య విశ్వవిద్యాలయంలోని డెయిరీ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సంయుక్తంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ రవికుమార్, ఐడిఏ ఏపీ చాప్టర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె నాగేశ్వరరావు, డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వై రవీంద్రారెడ్డి ప్రసంగించారు. తమ కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా చదువు అనంతరం ఉపాధి అవకాశాలు ఉద్యోగాలు మెండుగా లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజునాథ్, డాక్టర్ విజయ గీత, రవివర్మ, రాము, డెయిరీ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డెయిరీ అసోసియేషన్

ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లల సంక్షేమం కోసమే సర్వే

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: 0-18 సంవత్సరాల ప్రత్యేక అవసరాలు కలిగిన ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాలలో చేర్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నామని తిరుపతి జిల్లా సమగ్ర శిక్షణ సహిత విద్యా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామచంద్రారెడ్డిలు అన్నారు. శనివారం వారు మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక ప్రతిభా వంతులు, వారి తల్లిదండ్రుల పిల్లలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని కోరారు. పిల్లలను వయసు ఆధారంగా వివిధ పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. వీరిని తీర్చిదిద్దే బాధ్యత భవిత ప్రత్యేక ఉపాధ్యాయులు పి



ప్రత్యేక ప్రతిభావంతుల పిల్లల సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వెంకట్రమణ, ఎం రమణయ్య తీసు కున్నారని పిల్లల తల్లి దండ్రులకు తెలి పారు. ప్రతి భవిత కేంద్రంలో ప్రత్యేక విద్యా ఉపకరణాలు, వ్యాయా మ శిక్షణ, ఇంటి వద్దనే విద్య, ప్రభు త్వం అందించే సంక్షేమ పథకాలు , ఎస్కార్ట్ అలవెన్సులు, రవాణా ఛార్జీలు అందించి శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మ విశ్వాసం నింపడమే భవిత కేంద్రాల లక్ష్యమన్నారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలతో మాట్లాడారు. శిక్షణ ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు.

అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో హనుమ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు . పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు , అన్నదానం నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక శ్రీ కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో హనుమ జయంతి పర్వదినం సందర్భంగా స్వామికి విశేషాలంకరణ, అభిషేకం, భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. గూడూరు పట్టణంలోని శ్రీరామరక్ష కుటీరంలో హనుమ జయంతోత్సవాలు నిర్వహిం చారు. పట్టణంలోని తమ్మిశెట్టి గుంట, జాంగ్ర వీధి, ఆర్‌టిసి బస్టాండు వద్ద ఉన్న పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి , భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

తిరుపతి డెస్క్: పాకాల మండలంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బైనపల్లి పంచాయతీ పెద్దబైనపల్లి గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద రఘునాథరెడ్డి,ముని లక్ష్మి దంపతులు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం (చంద్రగిరి): హనుమాన్ జయంతి సందర్భంగా చంద్రగిరి మండల మిట్టపాలెం పంచాయతీ శ్రీవారి మెట్టు మార్గంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. రాయల చెరువు కట్ట కింద ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కుప్పం బాదురు బేడీ ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. రాయలచెరువు శ్రీ శక్తి పీఠంలో ఆంజనేయస్వామి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు.



గూడూరులో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

చెర్లోపల్లిలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీలో శ్రీ భక్తిసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఆలయ ధర్మకర్త రమేష్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్ స్వామి పాల్గొన్నారు.

క్రైం న్యూస్



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపాల్టీ పరిధి లోని నెల్లటూరు గ్రామ సమీపంలో నిర్జన ప్రదేశంలో సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన ఓగుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని గుర్తించామని రూరల్ పోలీసులు తెలిపారు. మృతుని శరీరంపై గాయాలు ఉండడం, శరీరంపై బ్లూ రంగు నిక్కరు మాత్రమే ఉందని, మృతిని వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు వివరాలు తమకు తెలపాలని పోలీసులు పేర్కొన్నారు.



ద్విచక్ర వాహనాన్ని లాక్కెళ్లడంతో మండుతున్న స్కూటర్

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: లారీ ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన నారా యణవనం మండలంలో శనివా రం చోటుచేసుకుంది. నారాయ ణవనం మండల పరిధి లోని పాలమగళంలో తిరుపతి నుండి చెన్నై వెళుతున్న లారీ ద్విచక్ర వాహనంలో వెళుతున్న గుణ (35)ను ఢీకొంది. దీంతో యువ కుడు తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్ సాయంతో అతడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. స్థానికులు మాట్లాడుతూ లారీ డ్రైవర్ మద్యం మత్తులో వుండడమే ఈ ప్రమాదానికి కారణమని తెలిపారు. ద్విచక్రవాహన దారుడు గుణను లారీ ఢీకొనడంతో రోడ్డుకు అవతల పడ్డాడని తెలిపారు. మోటార్ సైకిల్ లారీకి తగులుకుని దాదాపు 200 మీటర్ల లాక్కు వెళ్లడంతో మోటార్ సైకిల్ మండుకుందని వారు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయం

- ఆచార్య శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక నిర్మాణంలో నీలం సంజీవరెడ్డి సేవలు చిరస్మర ణీయం అని ఆచార్య శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. భారత ఆరవ రాష్ట్రపతి గా పనిచేసిన నీలం సంజీవరెడ్డి 27వ వర్ధంతిని పురస్కరించుకొని యస్వీయూలోని వారి నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి యస్‌వియూ అధికారులు నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య వి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 1954 లో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాప నలో సంజీవరెడ్డి కృషి ఎంతో వుందని, వారికి విశ్వవిద్యాలయం ఎప్పటికీ రుణపడి వుంటుందని తెలిపారు. వారికి యస్వీయూ 1958లో గౌరవ డాక్టరేట్ ఇచ్చిందని గుర్తు చేశారు. వారు మన మధ్య లేకపోయినావారి వారి దీర్ఘ దృష్టి వల్ల వేల మంది విద్యార్థులు చదువుకుని, గొప్ప స్థానాల్లో వున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రారు ఆచార్య మహమ్మద్ హుస్సేన్, మీడియా కో ఆర్డినేటర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, ఇంజనీర్ తాండవ కృష్ణ, ఇంజనీరు సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ :

ప్రభుత నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తిరుపతిలోని ఇంటర్మీడియట్‌విద్యా మండలి ఆర్ఐఒ కార్యాలయం ఎదుట రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్, ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, తెలుగు రాష్ట్ర స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జయరాజ్‌లు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరపతి నగరంలో కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలలు పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అపార్టుమెంట్లలో పర్మిషన్ లేని బిల్డింగ్‌లలో, ప్లే గ్రౌండ్ లేకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఫైర్ సేఫ్టీ లేకుండా విద్యార్థులకు కనీస మౌలిక వసతులు లేకుండా వారికి నచ్చిన విధంగా ఏర్పాటు చేసుకుని ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కళాశాల బిల్డింగ్ పర్మిషన్ 2 వుండగా వారు అధంగా 5,6 ఫ్లోర్ లు వుండే బిల్డింగ్ లు ఏర్పాటు చేసుకొని మొత్తం వాటిలోనే రెసిడెన్షియల్ హాస్టల్స్‌కు ఎలాంటి పర్మిషన్ లేకపోయినా ఏర్పాటు చేసుకొని లక్షల రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లి దండ్రులను మోసం చేస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలంచెల్లిన బస్సులతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అడ్మిషన్ ఫీజు కార్పొరేట్ నారాయణ చైతన్య కళాశాలలు 10 వేల నుండి 15 వేల వరకు ప్రైవేటు 3 వేల నుండి 5 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నాయని వారు విమర్శించారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేటు కళాశాలపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.